సాక్షి అనంతపురం

సోమవారం । 20 । నవంబర్ । 2023



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జాతీయస్థాయి పోటీలకు 'అనంత' క్రీడాకారులు 8లో

జాతీయ స్థాయి ఫెన్సింగ్, ఖోఖో పోటీలకు అనంతపురం జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అర్హత సాధించారు.

గరిష్టం/కనిష్టం 34.9°/20.7°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగింది. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రహదారి భద్రత అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం కల్చరల్: రహదారి భద్రత ప్రమాణాలు పాటించడం అందరి బాధ్యత అని కలెక్టర్ గౌతమి అన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రోడ్డు భద్రత, మహిళా సాధికారత అనే అంశాలపై అవగాహన కల్పిస్తూ మహిళలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ చైర్మన్ పద్మ అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ గౌతమి, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ఆత్మీయ అతిథులుగా హాజరై ప్రారంభించారు. అంతకు ముందు మైమ్ షో ద్వారా నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం అందరినీ ఆలోచింపజేసింది. సప్తగిరి సర్కిల్‌లోని ఇన్నర్ వీల్ బస్టాప్ వద్ద జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలను నడపడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ ప్రయాణాలు సాగించడం, డ్రైవింగ్‌పై అవగాహన లేకున్నా విపరీతమైన వేగంతో వాహనాలు నడపడం, కారులో సీటు బెల్టు ధరించకపోవడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడిపేటపుడు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ఆర్టీఓ గ్రంధి వెంకటేశులు, డీటీసీ వీర్రాజు, ఇన్నర్‌వీల్ సెక్రటరీ లక్ష్మీ, శ్రీవల్లి, ప్రతిమా సుధీర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ సభ్యులు జయంతి, శాంతి, శారద, యోగా గురువు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రేపు అధికార భాషా సంఘం అధ్యక్షుడి రాక

అనంతపురం అర్బన్: రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.విజయబాబు ఈ నెల 21న జిల్లాకు రానున్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకు అనంతపురంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెలుగుభాష అమలుపై రెవెన్యూ భవన్‌లో సమీక్ష ఉంటుంది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అతిథి గృహంలో తెలుగు సాహితీ ప్రముఖులతో చర్చాగోష్ఠిలో పాల్గొంటారు. 4 నుంచి 4.45 గంటల వరకు విలేకరుల సమావేశంలో మాట్లాడనున్నారు. 6 గంటలకు ఇక్కడి నుంచి బయల్దేరి విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు.

మహనీయుడు సత్యసాయి







ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి, జ్యోతి ప్రజ్వలనతో మహిళా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే, ప్రత్యేక పూజలందుకున్న సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరాంబ

- మహిళా సాధికారతకు బాబా చేసిన కృషి శ్లాఘనీయం
- కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శోభా కరంద్లాజే
- ప్రశాంతి నిలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

ప్రశాంతి నిలయం: మహిళా సాధికారతకు పాటు పడిన మహనీయుడు సత్యసాయి అని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే కొనియాడారు. సత్యసాయి 98వ జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళ అంటే అబల కాదని, లోకాన్ని తీర్చిదిద్దే దివ్య శక్తి అని సత్యసాయి చెప్పేవారని గుర్తు చేశారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమలను బోధిస్తూ మానవాళిని సన్మార్గంలో నడిపిన సమతామూర్తి అని శ్లాఘించారు. అభాగ్యులను అమ్మలా ఆదరించారన్నారు. 90వ దశకంలోనే మహిళలను విద్యావంతుల్ని చేసేందుకు అనంతపురం మహిళా క్యాంపస్‌ను ప్రారంభించారని గుర్తు చేశారు. నేడు మహిళలు టీచర్లుగా, ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, యుద్ధ విమానాలు నడిపే పైలట్లుగా రాణిస్తుండడమే కాకుండా రాజకీయాల్లోనూ తమదైన శైలిలో దూసుకుపోతుండడం గర్వకారణమన్నారు. ఎందరో మహిళలు వాణిజ్య దిగ్గజాలుగా పేరు గడించారని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. అనంతరం గౌరవ అతిథులుగా వేడుకల్లో పాల్గొన్న మైసూరు రాజమాత ప్రమోదాదేవి, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ యూరోపియన్ విభాగం సలహాదారు పెట్రా కలినోస్కీలు సత్యసాయితో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరి నిర్వహించారు. అంతకుముందు సత్యసాయి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినులు వేదపఠనం చేశారు. సత్యసాయిని కీర్తిస్తూ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ విద్యార్థులు నాదస్వరం వాయించగా, పూర్ణకుంభాలు, బ్రాస్ బ్యాండ్‌తో సత్యసాయి హయ్యర్ సెకెండరీ, అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థినులు చేసిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ఆయన సతీమణి హిమవాహిని రత్నాకర్, చక్రవర్తి, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి మాధురి నాగానంద, సత్యసాయి అనంతపురం మహిళా క్యాంపస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

- గ్రంథాలయ శాఖ డీడీ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కళ్యాణదుర్గం: గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పాఠకులకు పౌర గ్రంథాలయాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (విజయవాడ) శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను గ్రంథాలయాలల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, గ్రంథాలయాధికారి హెచ్.శ్రీనివాసులు, హెచ్ఎం మంజుల యాదవ్, శ్యామల, బీడీసీ నిర్వాహకులు బాలచంద్ర, యమున, పాఠకులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసం!

- వెలుగులోకి ఉపాధ్యాయుడి బాగోతం
- డిపాజిటర్ల సొమ్ముతో రియల్ దందా
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

రాయదుర్గం: ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో కొందరు ఆర్థిక వ్యవహారాల్లో ఇరుక్కుంటున్నారు. అదనపు ఆదాయం కోసం చిట్స్ నిర్వహిస్తూ సభ్యులకు డబ్బు ఇవ్వకుండా మొండికేసి ఇబ్బందులు పెడుతున్నారు. ఇటీవల రాప్తాడు టీచర్ రమేష్ చిట్స్ (చీటీల) వ్యవహారంలో కేసు నమోదై రిమాండ్‌కు వెళ్లడంతో పాటు విధుల నుంచి సస్పెండయ్యారు. ఇప్పుడు రాయదుర్గం నియోజకవర్గంలో మరొక ఉపాధ్యాయుడు బినామీల పేరుతో చిట్‌ఫండ్ సంస్థ పెట్టి డిపాజిటర్ల సొమ్మును తన రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు మళ్లించుకున్నాడు. ఇటీవల రాయదుర్గానికి చెందిన ఓ బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఉపాధ్యాయుడి బాగోతం బయటకు వచ్చింది. ఇలాంటి బాధితులు చాలామందే ఉన్నట్లు తెలుస్తోంది. రాయదుర్గం నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గంతో పాటు కర్ణాటకలోని బళ్లారిలో చిట్‌ఫండ్ వ్యవహారాలు ఉన్నాయి. సభ్యులకు తెలియకుండా చిట్ పాడటం.. ఆ డబ్బును సొంతానికి వాడుకోవడం చేస్తున్నాడు. మరికొంతమంది డిపాజిటర్లకు అయితే సొమ్ము తిరిగి ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నాడు. బాధితుల నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో మూడు చోట్ల బోర్డు తిప్పేశాడు. తాజాగా రాయదుర్గంలోనూ మూడు నెలలుగా ఆర్థిక లావాదేవీలు నిలిపేశాడు.



ఇక్కడ నిబంధనల ప్రకారం రూ.5లక్షలలోపు చిట్స్ లావాదేవీలు జరపాల్సి ఉండగా.. రూ.10 లక్షల వరకు సాగించారనే అభియోగాలు ఉన్నాయి. డిపాజిటర్ల సొమ్ముతో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు చేసి లాభాలు ఆర్జిస్తున్నట్లు తెలిసింది.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

రాయదుర్గంలో ఓ చిట్‌ఫండ్ కంపెనీపై ఇటీవల ఆరోపణలు వ్యక్తమయ్యాయి. విచారణలో అక్రమాలు రుజువైతే కంపెనీ లైసెన్స్ రద్దుచేస్తాం. ఎస్పీకి ఫిర్యాదు చేసిన వ్యక్తికి డబ్బు సెటిల్‌మెంట్ చేసినట్లు తెలిసింది. చిట్స్ పేరిట అనుమతులు పొందిన వారు నిబంధనలకు లోబడే వ్యవహరించాల్సి ఉంటుంది. అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– నరసింహమూర్తి, చిట్స్ రిజిస్ట్రార్, అనంతపురం

ఫిర్యాదులు వస్తే విచారణ

చిట్స్‌లో వెలుగుచూస్తున్న మోసాలపై బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి తప్పక న్యాయం చేస్తాం. ఇప్పటికే ఎస్పీ గ్రీవెన్స్‌కు వెళ్లిన ఫిర్యాదుపై విచారణ చేసి బాధితుడికి నగదు ఇప్పించాం. చిట్స్ పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతాం. డిపాజిట్‌దారులు సైతం ఆలోచించి చిట్స్‌పై నిర్ణయం తీసుకోవాలి.

– బి.శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

బడుగుల పెన్నిధి వైఎస్ జగన్

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే బీసీలకు తగిన గుర్తింపు
- చంద్రబాబుకు బీసీలంటే ఓటు బ్యాంకు మాత్రమే
- బీసీల అభ్యున్నతిపై బహిరంగ చర్చకు సిద్ధమా?
- కాలవ శ్రీనివాసులుకు పైలా నరసింహయ్య సవాల్



మాట్లాడుతున్న పైలా

తాడిపత్రి అర్బన్: బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్నిధి లాంటివారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఆదివారం తాడిపత్రిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వంపైన, సీఎంపైన చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఖండించారు. బీసీల అభ్యున్నతి, సంక్షేమం ఎవరి హయాంలో ఎంత జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధమా అని కాలవకు సవాల్ విసిరారు. పాతికేళ్లుగా బీసీలను చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో మాత్రమే టీడీపీ నాయకులకు బీసీలు గుర్తుకొస్తారన్నారు. పార్టీలో ఉనికి కోసం కాలవ అవాకులు చెవాకులు పేలుతుంటారని దుయ్యబట్టారు. బీసీ సామాజిక వర్గం సంక్షేమం వైఎస్సార్‌సీపీ పాలనలోనే జరుగుతోందన్నారు. బీసీల్లో నలుగురికి రాజ్యసభ సీట్లు, 25 మందికి ఎమ్మెల్సీ పదవులు కేటాయించిన నేత వైఎస్ జగన్ అని కొనియాడారు. మంత్రి వర్గంలోనూ ప్రాధాన్యత కల్పించారన్నారు. టీడీపీ చరిత్రలో ఒక్క బీసీ నేతను కూడా రాజ్యసభకు పంపిన దాఖలాలు లేవని విమర్శించారు. టీడీపీ హయాంలో ఆదరణ పథకం పేరిట నాసిరకం పనిముట్లు పంపిణీ చేసి బీసీలను బురిడీ కొట్టించారన్నారు. చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తే.. అదే బీసీలను జగన్ గుండెల్లో పెట్టుకుని రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలిచారని వివరించారు. నాయీబ్రాహ్మణుల తోక కత్తిరిస్తామని, జడ్జి పదవులకు బీసీలు పనికి రారని, ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అంటూ అవమానపరిచిన చరిత్ర చంద్రబాబుదని విరుచుకు పడ్డారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని సమాజానికి వారు బ్యాక్ బోన్ అని జగన్ చాటి చెప్పారన్నారు.

అంబరం.. గుడికట్ల సంబరం



అనంతపురం జూనియర్ కళాశాలలో గుడికట్ల సంబరాలకు హాజరైన కురుబలు



గుడికట్ల సంబరాలలో ఐక్యత చాటుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే శంకర నారాయణ, మాజీ మేయర్ రాగే పరశురామ్, కురుబ సంఘం నేతలు

- భారీగా తరలివచ్చిన కురుబలు
- శోభాయమానంగా స్వాముల ఊరేగింపు
- ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్‌తో పూల వర్షం
- హాజరైన కురుబ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు

అనంతపురం టౌన్/ టవర్ క్లాక్: కురుబలు 'మన గుడికట్లు..మన సంప్రదాయాలు' పేరుతో అనంతపురం వేదికగా నిర్వహించిన గుడికట్ల సంబరాలు అంబరమంటాయి. భారీ ఎత్తున తరలివచ్చిన కురుబలు తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, ఐక్యత, సఖ్యతను చాటారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి కురుబలు ఇలవేల్పులైన 250 స్వాములను ప్రత్యేక వాహనాల్లో కొలువుదీర్చి శనివారం సాయంత్రం నుంచే అనంతపురం శివారులోని ఇంటెల్ కళాశాల సమీపంలోకి చేరుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి స్వాముల ప్రదర్శన అట్టహాసంగా సాగింది. ఉరుములు, వాయిద్యాలు, డీజే సౌండ్, మరగాళ్లు, గొరవయ్యలు తదితర కళాకారుల ప్రదర్శనల నడుమ స్వాముల ఊరేగింపు శోభాయమానంగా మొదలైంది. కళ్యాణదుర్గం రోడ్డు మీదుగా నడిమి వంక, క్లాక్‌టవర్, సప్తగిరి సర్కిల్, పాతూరు మీదుగా గుడికట్ల సంబరాల వేదిక ఏర్పాటు చేసిన కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు ర్యాలీ సాగింది. అక్కడ గుడికట్ల (ఇలవేల్పు) స్వాములన్నీ కొలువుదీరాయి. 30 ఏళ్ల తర్వాత జరిగిన గుడికట్ల సంబరాలకు ఆడ, మగ, పిల్లలు, పెద్దలు తేడా లేకుండా తరలివచ్చిన కురుబ కులస్తులు స్వాములను దర్శించి తరించారు. జిల్లా కురుబ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక హెలికాప్టర్‌తో గగనతలం నుంచి స్వాములపై పూల వర్షం కురిపించారు. ఈ అపూర్వ ఘట్టాన్ని కురుబలు ఫొటోలు, వీడియోల్లో బంధించి దాచుకున్నారు. జై కురుబ.. జైజై కురుబ అంటూ చేసిన నినాదాలు ప్రతిధ్వనించాయి.

- గుడికట్ల సంబరాల వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జానపద గేయాలతోపాటు 'కురబరో.. నేను కురుబరో' అనే డీజే పాటలు కురుబల్లో ఉత్సాహం నింపాయి. ఈ పాటకు ప్రజాప్రతినిధులతోపాటు కురుబ సంఘం నాయకులు నృత్యాలు చేశారు. ఇదే స్ఫూర్తితో కురుబలు అన్ని రంగాల్లోనూ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ప్రముఖుల హాజరు..

గుడికట్ల సంబరాలకు ప్రజాప్రతినిధులు, కురుబ సంఘం నేతలు, ప్రముఖులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మంత్రి ఉషశ్రీ చరణ్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, మాజీ మేయర్ రాగే పరశురాం, కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, మాజీ చైర్‌పర్సన్ సవితమ్మ, వైఎస్సార్‌సీపీ హిందూపురం సమన్వయకర్త దీపిక, కురుబ సంఘం మహిళా అధ్యక్షురాలు బిల్లే శివబాల, విశ్రాంత జడ్జి కిష్టప్ప, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, నెమలివరం ఈశ్వరయ్య, కేటీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



గొరవయ్యల సందడి



కురుబల ఇలవేల్పు స్వాముల ఊరేగింపు



వేదిక వద్ద హెలికాప్టర్‌తో పూల వర్షం

తల్లీ బిడ్డకు నాణ్యమైన వైద్యం

- సర్వజనాస్పత్రిలో లేబర్ ఎమర్జెన్సీ ఓటీ, మరో ఎస్ఎన్‌సీయూ ఏర్పాటు

అనంతపురం మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. అనంతపురం సర్వజనాస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా తల్లీ, బిడ్డలకందించే సేవల్లో మరింత నాణ్యతా ప్రమాణాలు పాటించేందుకు గైనిక్, చిన్న పిల్లల విభాగాలను బలోపేతం చేస్తోంది. హైరిస్క్ గర్భిణులకు సకాలంలో సిజేరియన్ చేసేందుకు నూతన ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశారు. అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్‌స్ట్రిక్స్ అండ్ గైనకాలజీ మార్గదర్శకాల ప్రకారం నెలలు నిండిన, నొప్పులు వచ్చిన హైరిస్క్ కేసుకు 20 నిమిషాల వ్యవధిలో సిజేరియన్ జరగాల్సి ఉంటుంది. గతంలో అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ) యూనిట్‌లో ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ ఉండేది. నూతన ఆపరేషన్ థియేటర్‌ను లేబర్ వార్డుకు ఆనుకుని ఏర్పాటు చేశారు. కష్టతరమైన కేసును నిమిషాల వ్యవధిలో థియేటర్‌కు తరలించి సిజేరియన్ చేసే సదుపాయం ఉంది. గతంలో కలెక్టర్ మినరల్ ఫండ్ రూ.56 లక్షలతో థియేటర్‌ను నిర్మించగా, అందులో పరికరాల కొనుగోలుకు ఎంపీ రంగయ్య రూ.20 లక్షలు కేటాయించారు.



ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో సిజేరియన్ చేసేందుకు వినియోగించే బెడ్

మరో 20 పడకలతో ఎస్ఎన్‌సీయూ

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఇప్పటికే 20 పడకల సామర్థ్యంలో నవజాత శిశు కేంద్రం (ఎస్ఎన్‌సీయూ) ఇదివరకే ఉంది. ఇక్కడ బరువు తక్కువ, జాండీస్, సెప్సిస్ (ఇన్ఫెక్షన్), తదితర సమస్యలతో ఉన్న నెలలోపు పసికందులకు ఫొటోథెరపీ, వార్మర్లలో ఉంచి సేవలందిస్తారు. పసికందులు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో ప్రభుత్వం మరో నవజాత శిశు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఎన్‌హెచ్ఎం నిధులు రూ.35 లక్షలతో పాటు ఇటీవల ప్రభుత్వం పునరుద్ధరణకు విడుదల చేసిన నిధుల నుంచి మరో రూ.7 లక్షలు వెచ్చించి ఎస్ఎన్‌సీయూ ఏర్పాటు చేశారు. మరో వారం రోజుల్లో ప్రారంభం కానుంది.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.10 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో గ్రామ దేవత కొల్లాపురమ్మ ఆలయ నిర్మాణానికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.10లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు రాప్తాడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జోలా రామచంద్రారెడ్డి, వీఆర్వో మహేష్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ రెడ్డి, పసల నరసింహారెడ్డి, ఎస్‌టీడీ శ్రీనివాస రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మంజు, తాతిరెడ్డి, ఓబిరెడ్డి, లక్ష్మీరెడ్డి, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

గుత్తి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన గోవిందు, కనక మహాలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. ఉద్యోగం రాకపోవడంతో పాటు రెండో కుమారుడు సునీల్‌కుమార్ (32) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చివరకు తనలో తానే మాట్లాడుకోవడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన సునీల్‌కుమార్... ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై అక్కడకు చేరుకుని సునీల్ కుమార్‌ను కాపాడారు. అప్పటికే తీవ్ర గాయాలతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందేలోపు మరణించాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు అనంత క్రీడాకారులు

అనంతపురం: జరిగే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు అనంత క్రీడాకారులు అర్హత సాధించారు. కర్నూలు జిల్లా నంద్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ చాటి బంగారు పతకాలు దక్కించుకుని, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో పి. పుష్పలత, ఎం.చేతన, ఎస్.నాగవర్షిత, బి.సాయిగీత, ఎస్ఎన్ ప్రణవ్‌కుమార్, కె.చిన్మయి, బీవీ శివకుమార్, పి.నవనీత్ ఉన్నారు. అలాగే కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటిన కె.సంధ్య జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని డీఈఓ నాగరాజు, ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ ఎల్. నాగరాజు, ఉభయ జిల్లాల కార్యదర్శులు సుగుణమ్మ, అంజన్న అభినందించారు.

ఉద్యానానికి రూ.12.93 కోట్లు

- 6,300 మంది రైతులకు లబ్ధి చేకూరేలా కార్యాచరణ
- క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక, ఆన్‌లైన్‌లో వివరాలు
- ఈ-క్రాప్ ఆధారంగా ఉచిత పంటల బీమా వర్తింపు



చీనీ



దానిమ్మ

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లా పండ్లతోటల రైతులకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరేలా అన్ని రకాల పథకాల అమలుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.12.93 కోట్లు బడ్జెట్ కేటాయించింది. ఉద్యాన తోటల విస్తీర్ణం, దిగుబడులు, ఫలసాయం టర్నోవర్ పరంగా ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఏపీగా... ఉద్యానహబ్‌గా పేరుగాంచిన అనంతలో ఉద్యాన వికాసానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. ఈ ఏడాది మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) కింద 6,124 మంది రైతులకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా రూ.9.63 కోట్లు కేటాయించారు. ఆర్‌కేవీవై కింద 182 మందికి మేలు జరిగేలా రూ.3.30 కోట్లు ఇచ్చారు. ఇలా... ఈ ఏడాది జిల్లాకు 6,306 మంది రైతులకు వివిధ పథకాల కింద ప్రయోజనం కలిగేలా రూ.12.93 కోట్లు ఖర్చు చేయనున్నారు. క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన రైతుల గుర్తింపు, ఆన్‌లైన్ డాక్యుమెంటేషన్ పూర్తి కాగా పథకాల ఫలాలు రైతులకు అందివ్వనున్నారు.

33 రకాల పథకాలు..

ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై కింద ఈ ఏడాది ఉద్యానశాఖ ద్వారా 33 రకాల పథకాలతో కార్యాచరణను జగన్ సర్కార్ అమలు చేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో 60 రకాలకు పైగా ఉద్యాన తోటలు సాగులో ఉన్నాయి. దీంతో జిల్లాకు పథకాలు, బడ్జెట్ కూడా అధికంగా కేటాయించాల్సి వస్తోంది. ప్రధానంగా కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్ రూంలు, ప్లాస్టిక్ మల్చింగ్, ఫారంపాండ్ల నిర్మాణానికి ప్రాధాన్యత కల్పిస్తూనే కొత్త తోటల విస్తరణకు పెద్దపీట వేశారు. అలాగే తేనెటీగల పెంపకం, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్ లాంటి పండ్ల సాగుకు కొత్త పథకాలతో పాటు పందిర్లు, కూరగాయల పెంపకం లాంటి పాత పథకాలు కూడా అమలులో ఉంటున్నాయి. అంతేకాక వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద చీనీ, దానిమ్మ, ద్రాక్ష, టమాట తదితర పంటలకు బీమా పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్తింపజేస్తూ ఈ-క్రాప్ ఆధారంగా గత నాలుగేళ్లుగా పెద్ద మొత్తంలో పరిహారం ఇస్తుండటంతో రైతులకు మేలు జరుగుతోంది.

ఉద్యాన పథకాలకు కేటాయించిన నిధులు	
కార్యాచరణ	నిధులు
చిన్నపాటి నర్సరీల ఏర్పాటు	రూ.15 లక్షలు
కొత్తగా 1,475 హెక్టార్లలో పండ్లతోటల విస్తరణ	రూ.1.14 కోట్లు
రెండు, మూడేళ్ల నిర్వహణ ఖర్చులకు	రూ.76 లక్షలు
పుట్టగొడుగుల పెంపకానికి	రూ.24 లక్షలు
కమ్యూనిటీ ఫారంపాండ్లు	రూ.ఒక కోటి
వ్యక్తిగత ఫారంపాండ్లు	రూ.38 లక్షలు
ప్లాస్టిక్ మల్చింగ్	రూ.1.41 కోట్లు
యాంటీ బర్డ్‌నెస్ట్ ఏర్పాటు	రూ.17 లక్షలు
ప్యాక్ హౌస్‌లకు	రూ.1.28 కోట్లు
సోలార్ కోల్డ్ స్టోరేజ్ రూమ్‌లకు	రూ.26 లక్షలు
కలెక్షన్ సెంటర్లకు	రూ.1.80 కోట్లు
మినీ ట్రాక్టర్లకు	రూ.16 లక్షలు
తైవాన్ స్ప్రేయర్లకు	రూ.16 లక్షలు
ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లకు	రూ.10 లక్షలు
ఐపీఎం కింద	రూ.6 లక్షలు
శిక్షణా కార్యక్రమాలకు	రూ.8 లక్షలు

(ఇందులో ఎస్సీ రైతులు 666 మందికి, ఎస్టీ రైతులు 313 మంది, జనరల్ కోటా కింద 3,868 మందికి చేకూరనున్న ప్రయోజనం)

జేసీ అనుచరుడి దౌర్జన్యం

- దళిత సర్పంచ్‌ను అడ్డు పెట్టుకుని పంచాయతీపై పెత్తనం
- నిరసనగా సమ్మెబాట పట్టనున్న కార్మికులు



వేతనాల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

తాడిపత్రి టౌన్: మండలంలోని గన్నెవారిపల్లి కాలనీ మాజీ సర్పంచ్, జేసీ ప్రధాన అనుచరుడి దౌర్జన్యానికి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 36 మంది కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీలకు పంచాయతీని కేటాయించడంతో టీడీపీ మద్దతుదారు ఉమామహేష్ గెలుపొందాడు. అయినా పెత్తనమంతా మాజీ సర్పంచ్‌దే కావడంతో పాలన అస్తవ్యస్తమైంది. మూడు నెలల వేతన బకాయిల కోసం దాదాపు 14 రోజులుగా కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నా వారిని ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేవలం సర్పంచ్ సంతకం చేయకపోవడంతో కార్మికుల వేతనాలు ఆగినట్లు అధికారులు చెబుతున్నారు.

తమ్ముడిపై ప్రేమతో..

వాస్తవానికి సర్పంచ్ ఉమామహేష్ తన తమ్ముడి పేరును పంచాయతీ కార్మికుడిగా చేర్చి వేతనం కాజేసేందుకు కుట్ర చేసినట్లుగా ఆరోపణలున్నాయి. ఈ విషయంపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేయడంతో తమ్ముడి పేరు తొలగించాలని సర్పంచ్‌కు అధికారులు సూచించారు. దీనికి సర్పంచ్ ససేమిరా అంటూ మాజీ సర్పంచ్ అండ చూసుకుని వేతన బిల్లులపై సంతకాలు చేయకుండా మొండికేశారు. దీంతో మూడు నెలలుగా వేతనాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

సమ్మె బాటలో కార్మికులు..

బకాయి వేతనాలు చెల్లించాలంటూ 14 రోజులుగా కార్మికులు వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో సమ్మెలోకి వెళ్లేందుకు కార్మికులు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించి కార్యాచరణనూ సిద్ధం చేశారు. ఈ విషయమై ఈఓఆర్డీ జిలాన్‌బాషా మాట్లాడుతూ.. కార్మికులు సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నది వాస్తవమేనన్నారు. వేతన బిల్లులపై సర్పంచ్ సంతకం చేయకపోవడం వల్లనే సమస్య ఉత్పన్నమైందన్నారు. సంతకం చేస్తే మరుసటి రోజే కార్మికులకు వేతనాలు అందజేస్తామని స్పష్టం చేశారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

యాడికి: చోరీ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. ఆదివారం సాయంత్రం రాయలచెరువు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఈ నెల 3న యాడికి మండలం కూర్మాజీపేటలో, ఈ నెల 14న తాడిపత్రిలో చోరీ చేసినట్లుగా అంగీకరించారు. నిందితులను యాడికి నివాసి రాజకుళ్లాయప్ప అలియాస్ రాజు, అనంతపురానికి చెందిన ఇబ్రహీంగా గుర్తించారు. వీరిలో రాజు గతంలో కర్ణాటకలోని కుడితిని పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కేసులో అక్కడి పోలీసులకు పట్టుబడి ఏడాది పాటు జైలు జీవితం గడిపాడు. అనంతరం అనంతపురానికి చేరుకుని బేల్దారి పనులు చేసుకునేవాడు. ఈ క్రమంలో తనకు పరిచయమైన ఇబ్రహీంతో కలసి వ్యసనాలకు బానిసయ్యాడు. తమ వ్యసనాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం చోరీలను మార్గంగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో కూర్మాజీపేట, తాడిపత్రిలో చోరీ చేశారు. వీరి నుంచి ఆరు తులాల బంగారు నగలు, 30 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కేసులో రాజీకి రమ్మని బెదిరింపులు

- ఏఆర్ పీసీ సుధీర్‌తో పాటు బంధువులపై కేసు నమోదు

అనంతపురం క్రైం: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న అవివాహితను ప్రేమ పేరుతో మోసం చేసి శారీరక అవసరాలు తీర్చుకున్నారన్న ఫిర్యాదుపై 2020లో దిశ పోలీసులు నమోదు చేసిన కేసులో బాధితురాలికి బెదిరింపులు మొదలయ్యాయి. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఏఆర్ పీసీ సుధీర్‌ను రిమాండ్‌కు పంపారు. ప్రస్తుతం కోర్టు పరిధిలో విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో కేసును వెనక్కు తీసుకోకపోతే చంపుతామని నిందితుడు బెదిరింపులకు దిగడంతో పోలీసు స్పందనలో మరోసారి బాధితురాలు ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ. 5 లక్షలు నగదు తీసుకెళ్లడమే కాకుండా శారీరక అవసరాలు తీర్చుకుని మోసం చేశాడని, తాజాగా బెదిరింపులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వాపోయింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు సుధీర్‌తో పాటు అతని తల్లిదండ్రులు, బంధువులు మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

అలరించిన 'సాయి వైభవం'



నృత్యరూపకంలోని సన్నివేశం



సంగీత విభావరి నిర్వహిస్తున్న సుధారఘునాథన్ బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి అవతార వైభవాన్ని వివరిస్తూ శ్రీసత్యసాయి విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. సత్యసాయి 98వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు సుధా రఘునాథన్... సంగీత విభావరి నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో భక్తులను అలరించారు. అనంతరం 'సాయి ప్రేమావతారం' పేరుతో శ్రీసత్యసాయి హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం మంత్రముగ్ధులను చేసింది.

జనవాక్కు

ఉచితంగా కంటి పరీక్షలు



కంటి చూపు సక్రమంగా లేక తీవ్ర ఇబ్బంది పడుతుండేదాన్ని. ఆస్పత్రికి పోదామంటే పని ఒత్తిడి వల్ల ఎవరూ నాకు తోడు రాలేకపోయారు. అలాగే కాలం నెట్టుకొచ్చా. మా ఊళ్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెట్టిన తర్వాత వెళ్లి చూపించుకున్నా. వైద్యాధికారులే సొంతంగా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా కంటి పరీక్షలు చేయించి, అద్దాలు ఇచ్చారు. ఇప్పుడు చూపు బాగుంది. జగన్ బాబు మేలు మరువలేను.

– దాసరి చంద్రమ్మ, కమ్మూరు, కూడేరు మండలం

ఇంట్లో అందరికీ ఉచిత వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మాలాంటి నిరుపేదలకు నిజంగా ఓ వరం. ఇలాంటి వైద్య సేవలు గతంలో నేనెన్నడూ చూడలేదు. నిపుణులైన వైద్యులే మా ఊరికి వచ్చి నాతో పాటు మాఇంట్లోని అందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, నాణ్యమైన మందులూ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ పథకాలు చాలా బాగున్నాయి. ఆయనే మళ్లీ సీఎం కావాలి.

– ఉమాపతి, చీకలగురికి, విడపనకల్లు

త్వరలో సొంతింట్లోకి



ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు కావాలని అధికారులను, నాయకులను అభ్యర్థించాను. ఆఫీసుల చుట్టూ తిరిగి అర్జీలు ఇచ్చాను. అయినా నాకు సొంతిల్లు రాలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత వలంటీర్ మేముంటున్న అద్దె ఇంటి వద్దకే వచ్చి వివరాలు అడిగి తెలుసుకుని వెళ్లారు. రోజుల వ్యవధిలోనే ఇంటి పట్టా వచ్చింది. నేనైతే ఏ ఆఫీసూ మెట్టు ఎక్కలేదు. ఇప్పుడు ఇంటి నిర్మాణం కూడా పూర్తవుతోంది. త్వరలో సొంతింట్లోకి చేరుకుంటాం. నా కలను నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– సొరెడ్డి లక్ష్మీదేవి, గంగాదేవిపల్లి, తాడిపత్రి మండలం

నా కల సాకారమైంది



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయంపైనే ఆధారపడ్డాను. వర్షాభావం కారణంగా పంట సాగు భారమయ్యేది. దీంతో పొలంలో బోరు వేయించుకునే ఆర్థిక స్తోమత లేదు. దీంతో బోరుపై ఆశ వదులుకున్నా. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత మా రైతుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారు. అందులో భాగంగానే ఎన్నో ఏళ్లుగా నేను పరితపిస్తున్న బోరుబావిని వైఎస్సార్ జలకళ పథకం కింద నా పొలంలో ఉచితంగా వేయించారు. విద్యుత్ కనెక్షన్ ఇప్పించారు. ఇప్పుడు నా పొలంలో మామిడి మొక్కలు నాటాను. అంతర పంటగా కంది సాగు చేపట్టాను. మా బతుకులు మార్చిన వైఎస్ జగన్ కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నా.

– పవన్ ఆంజనేయులు, కసాపురం, గుంతకల్లు మండలం

ఖోఖో సబ్ జూనియర్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన సబ్ జూనియర్ బాల, బాలికల జట్లు

ఉరవకొండ: త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు ప్రాతినిధ్యం వహించే జిల్లా సబ్‌జూనియర్, జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం ఉరవకొండ వేదికగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి 280 మంది క్రీడాకారులు హాజరు కాగా, వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టులో మారుతీకుమార్, అజయ్‌కుమార్, నాగరాజు, గణేష్, భానుప్రకాష్, జ్యోతిరామ్, పెన్నయ్య, రాజేష్, ప్రతాప్, లోహితరాజు, హర్షవర్దన్, భారత్‌కుమార్, నందకుమార్, గంగాధర్, అఖిల్, తోయజ్, పృథ్వీరాజ్, సాయిచరణ్‌తేజ్, దీపక్‌కుమార్, భరత్ ఉన్నారు. అలాగే బాలికల జట్టులో మౌనిక, సునీత, హబీబా, మైనా, అనిత, చందన, స్వప్న, భార్గవి, సిద్దికా, ప్రణవి, రాజేశ్వరి, శాంతి, కావేరి, నిఖిత, చైతన్య, శ్రావణి, లక్ష్మమ్మ, పూజిత, నందిని, సాహితి, మంజుల, మౌనిక చోటు దక్కించుకున్నారు. జూనియర్ విభాగం బాలికల జట్టుకు అఖిల, రాజ్యలక్ష్మి, ఐశ్వర్య, సునీత, సంధ్య, షాహిదా, త్రివేణి, ముబీనా, ఆశా, యమున, జాహ్నవి, మౌనిక, చంద్రమ్మ, లావణ్య, సోనిక, జ్యోతి, త్రిష, రిత్విక ఎంపిక కాగా, బాలుర జట్టులో రవి, పురుషోత్తం, పెన్నోబులేసు, సురేష్, సంతోష్, హమీద్, శోచన్, ఉపేంద్ర, శేకప్ప, భరత్‌కుమార్, దేవేంద్ర, రాజన్న, మారేష్, జయరాములు, దిలీప్‌కుమార్, షబ్బీర్‌బాషా, లోకేష్, చరణ్, తరుణ్‌కుమార్, అనిల్‌కుమార్ చోటు దక్కించుకున్నారు. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకూ గుంటూరు జిల్లా నరసారావు పేటలో సబ్ జూనియర్ పోటీలు, డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకూ మార్కాపురంలో జూనియర్ పోటీలు జరగనున్నాయి. ఎంపికలను పీడీలు మారుతీప్రసాద్, ప్రభాకర్, కేశవమూర్తి, రాజేష్, సురేష్, రాజేష్, హలీమా, ప్రసాద్ పర్యవేక్షించారు.

నేటి నుంచి ప్రపంచ వారసత్వ వారోత్సవాలు

అనంతపురం కల్చరల్: ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకూ అనంతపురం వేదికగా ప్రపంచ వారసత్వ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్, కవి రియాజుద్దీన్ ఆదివారం తెలిపారు. జిల్లా పురావస్తు, పర్యాటక శాఖలు, ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటూ సాగే ఈ వేడుకలను సోమవారం ఉదయం ఆర్ట్స్ కాలేజ్ వద్ద హెరిటేజ్ వాక్‌తో కలెక్టర్ గౌతమి ప్రారంభించనున్నారు. 21న కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో పురాతన నాణేల ప్రదర్శన, 22న రోటరీ పాఠశాలలో విద్యార్థులకు తెలుగు శతక పద్య పఠన పోటీలు, 23న ఆర్ట్స్ కళాశాలలో యువతకు పద్య పఠన పోటీలు, 24న పీస్ మెమోరియల్ హాల్‌లో చిత్రలేఖన పోటీలు, 25న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, 26న ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో వారోత్సవాల ముగింపు వేడుకలు ఉంటాయి. ఉమ్మడి అనంత జిల్లా చరిత్రను ప్రతిబింబించేటా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇంటాక్ ప్రతినిధులు తెలిపారు.

సెస్సు.. లెస్సు!

- గ్రంథాలయ పన్నుల చెల్లింపుల్లో ఉదాసీనత
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పేరుకుపోయిన రూ.20.09 కోట్ల బకాయిలు

అనంతపురం: సెస్సు చెల్లింపులో స్థానిక సంస్థల ఉదాసీనత గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి అడ్డంకిగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి గ్రంథాలయ పన్నును పట్టణాలు, పంచాయతీలతో పాటు నగర పాలక సంస్థ అధికారులు వసూలు చేస్తున్నా.... వాస్తవానికి ఆ పన్ను గ్రంథాలయ సంస్థకు చేరవేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా గ్రంథాలయాల అభివృద్ధి కుంటుపడుతోంది. మౌలిక వసతుల కల్పనకు మృగ్యమవుతోంది. గ్రంథాలయాలకు వస్తున్న వారంతా నిరుద్యోగులు, విద్యార్థులే. వీరికి పోటీ పరీక్షల సామగ్రి, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచి, వారి ఉన్నతికి మార్గం సుగమం చేయాల్సిన బాధ్యత గ్రంథాలయ సంస్థపై ఉంది. అయితే స్థానిక సంస్థలు వసూలు చేసుకున్న సెస్సు జమ కాకపోవడంతో దీనిపై స్పష్టమైన చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఫలితంగా జిల్లాలో గ్రంథాలయాలు నీరసించిపోతున్నాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్ వద్ద గ్రంథాలయ సంస్థ సెస్సు బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. ఏ ఆర్థిక సంవత్సరంలోనూ పూర్తిగా సెస్సులు చెల్లించకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

బకాయిలు రూ. కోట్లలోనే..

అనంతపురం జిల్లా పరిధిలోని నగర కార్పొరేషన్, గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి(మునిసిపాలిటీ), కళ్యాణదుర్గం నగర పంచాయతీ, పామిడి గ్రామంతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలో ధర్మవరం, హిందూపురం, కదిరి, పుట్టపర్తి, మడకశిర నగర పంచాయతీల్లో సెస్సు బకాయిలు మొత్తం రూ.20.09 కోట్లకు చేరుకున్నాయి. జిల్లాలో గ్రంథాలయాల నిర్వహణకు ఆర్థిక మూలాధారం ఈ సెస్సు మాత్రమే కావడం గమనార్హం. ప్రజల నుంచి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్ అధికారులు వసూలు చేసే పన్నుల్లో కొంత గ్రంథాలయ సెస్సు కింద చెల్లించాల్సి ఉంటుంది. రూ.100కు రూ.8 చొప్పున గ్రంథాలయ సెస్సు వసూలు చేస్తున్నట్లుగా ప్రజలకు ఇచ్చిన రసీదుల్లోనూ ఆయా అధికారులు స్పష్టంగా పేర్కొంటున్నారు. అయితే సెస్సు వసూలు చేసుకుంటున్న స్థానిక సంస్థలు మాత్రం దానిని గ్రంథాలయ సంస్థకు చెల్లించడం లేదు.



అనంతపురంలోని కేంద్ర గ్రంథాలయం

2007 నుంచి ఇప్పటి వరకూ అనంతపురం జిల్లాలో పేరుకుపోయిన బకాయిలు ఇలా	
ప్రాంతం	బకాయి మొత్తం
అనంతపురం	రూ.5,24,83,875
గుత్తి	రూ.89,16,981
గుంతకల్లు	రూ.1,62,99,801
రాయదుర్గం	రూ.69,73,075
తాడిపత్రి	రూ.82,48,089
కళ్యాణదుర్గం	రూ.27, 23,246
పామిడి	రూ.23,52,244
మొత్తం	రూ.13,43,82,676

2007 నుంచి ఇప్పటి వరకూ శ్రీసత్యసాయి జిల్లాలో పేరుకుపోయిన బకాయిలు ఇలా	
ధర్మవరం	రూ.1,69,32,112
హిందూపురం	రూ.1,75,12,458
కదిరి	రూ.94,45,648
పుట్టపర్తి	రూ.27,74,124
మడకశిర	రూ.13,80,495
మొత్తం	రూ.4,80,44,837

నోటీసులు ఇస్తూనే ఉన్నాం

గ్రంథాలయ సంస్థకు బకాయిపడ్డ సెస్సు చెల్లించాలంటూ స్థానిక సంస్థలకు నోటీసులు ఇస్తూనే ఉన్నాం. ఇదే అంశంపై పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులను కలసి విన్నవించాం. స్థానిక సంస్థలు వసూలు చేసుకుంటున్న సెస్సు చెల్లిస్తే గ్రంథాలయాల అభివృద్ధి సాధ్యమవుతుంది. గ్రంథాలయాల స్థాయి కూడా పెంచేందుకు మార్గం సుగమమవుతుంది. సెస్సు చెల్లింపునకు స్థానిక సంస్థలు సహకరించాలి.

– ఎల్ఎం ఉమాదేవి, చైర్‌పర్సన్, జిల్లా గ్రంథాలయ సంస్థ

క్లుప్తంగా

వైభవంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

• హాజరైన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి (రాప్తాడు): రాప్తాడు మండలంలోని మరూరులో ఆదివారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేదపండితులతో అభిషేక, హోమాలు నిర్వహించి, అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠంచారు. అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ఎమ్మెల్యేతో పూజలు చేయించి, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు హేమావతి, పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు



వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో దివంగత ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్యాంటీన్‌కు సమీపంలోని సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రదాత అయిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. ఆదివారం విగ్రహ ఏర్పాటు స్థలానికి విగ్రహాన్ని తెచ్చారు. వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఉదయం నుంచి అక్కడే ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ . శంకర్ నాయక్, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ వి.మధుసూదన్ రెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి పాల్గొన్నారు.

బెడ్‌షీట్లు అందజేత



జీజీహెచ్‌లో రోగులకు బెడ్‌షీట్లు అందిస్తున్న ఎస్కేయూ ఉపకులపతి రామకృష్ణా రెడ్డి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలోనూ , వార్డుల ఆరుబయట నిద్రిస్తున్న రోగుల బంధువులకు ఎస్కేయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బెడ్‌షీట్లు అందించారు. ఆదివారం అర్ధరాత్రి ఎస్కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ రామకృష్ణా రెడ్డి, తదితరులు ఆస్పత్రి వద్ద బెడ్‌షీట్లు అందించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎస్కేయూ వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రాంగోపాల్, మురళీధర్ రావు, ఎంవీ శ్రీనివాసన్, టీచింగ్ అసిస్టెంట్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరగనుంది. అందు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 14, 20వ సచివాలయాల పరిధిలోని పాతూరు, ఉమానగర్‌లో జరగనుంది. వైఎస్సార్ సీపీ జెండాను క్లస్టర్ అధ్యక్షుడు, కార్పొరేటర్లు, తదితర ప్రజాప్రతినిధులు ఎగరవేయనున్నారు.

దళిత హక్కుల రక్షణపై సదస్సు



రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: మోదీ పాలనలో దళిత హక్కులకు రక్షణ లేకుండా పోయిందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి అన్నారు. రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణ, సామాజిక న్యాయం అనే అంశంపై ఈనెల 22న విశాఖపట్నంలో రాష్ట్ర సదస్సు జరుగుతుందన్నారు. ఆదివారం స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను నాయకులు విడుదల చేశారు.





పీటీసీ మైదానంలో ఇండియా, ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న క్రీడాభిమానులు

పీటీసీ మైదానం.. ఉత్కంఠ వీక్షణం!

భారత్ – ఆస్ట్రేలియా జట్ల మధ్య ప్రపంచ కప్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్ ఆదివారం జరిగింది. క్రికెట్ మ్యాచ్‌ను తిలకించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని పీటీసీ (పోలీస్ శిక్షణ కళాశాల) మైదానంలో పెద్ద తెర ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను పెద్ద ఎత్తున క్రీడాకారులు, యువత, క్రీడాభిమానులు ప్రశాంతంగా వీక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



యువత ఉత్సాహం

చిన్నారుల భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి

• జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



చిన్నారిని ఎత్తుకున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం సెంట్రల్: చిన్నారుల సంరక్షణ, భద్రతపై అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి ఆధ్వర్యంలో నగరంలోని బాల సదనం, శిశు గృహలో చిన్నారులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారుల దత్తత ప్రక్రియ అమలుపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు చదువు, ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ అంశాల్లో ఎలాంటి అవసరం ఉన్నా తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. బాలసదనం ఆవరణలో మొక్కలు నాటారు. పాటల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు, మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీసీపీఓ వెంకటేశ్వరి, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, బాల సదనం సూపరింటెండెంట్ నేతాజీ, డీహెచ్‌ఎల్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, నాగలక్ష్మి, సంధ్య, బోయ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంపనూరులో పార్కింగ్ అవస్థలు



ఆలయం బయట నిలిపిన కార్లు



ఆలయ ప్రాంగణంలో నిలిపిన ద్విచక్ర వాహనాలు

ఆత్మకూరు: జిల్లాలోనే ప్రఖ్యాతి గాంచిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద వాహనదారులు పార్కింగ్ కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రతి ఆది, మంగళవారాల్లో స్వామి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. స్వామి దర్శనానంతరం భక్తులు పంపనూరు వద్దనున్న సిటీ పార్కులో సరదాగా గడుపుతుంటారు. ఇందుకోసం పెద్ద సంఖ్యలో భక్తులు వందలాదిగా కార్లు, ద్విచక్ర వాహనాల్లో వస్తున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో స్వామి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో , ఆలయం బయట చాలా స్థలం ఉన్నా వాహనాలు నిలిపేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత వారంలో పంపనూరు హైవేపై పెద్ద రోడ్డు ప్రమాదాలు జరగడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



పంపనూరు ఆలయం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రాంగణం అంతా ఓం నమో సుబ్రహ్మణ్యేశ్వరా.. నామస్మరణతో మార్మోగింది. సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం కార్తీక మాసంకావడంతో పోటెత్తింది. కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో ఆలయంలో పెద్ద ఎత్తున మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అదేవిధంగా స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కాల సర్పదోష నివారణ కోసం రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కన్నుల విందుగా కల్యాణోత్సవం : కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో ఆలయంలో కనుల విందుగా కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీవలి, దేవసేన, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. పసుపు , కుంకుమ కలిపిన అక్షింతలతో వేద పండితుల మంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు.

ఉత్సాహంగా సమగ్రశిక్ష క్యాంప్ ఫైర్



కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ, సమగ్ర శిక్ష ఏపీసీ తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని వైవీ శివారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కేజీబీవీ సీఆర్టీలు, పీజీటీలకు జరుగుతున్న ఇండక్షన్ ట్రెనింగ్‌ను పురస్కరించుకొని ఆదివారం రాత్రి నిర్వహించిన క్యాంప్ ఫైర్ ఉత్సాహంగా సాగింది. సమగ్ర శిక్ష ఎస్పీడీ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హాలులో కాకుండా ఆరుబయట సమావేశం ఏర్పాటు చేశారు. డిస్‌ప్లే బోర్డ్ ఏర్పాటు చేసి, ట్రెనింగ్‌లో తయారు చేసిన మెటీరియల్‌ను ప్రదర్శించారు. ఏపీసీ మాట్లాడుతూ పిల్లలందరికీ గుణాత్మక విద్య బోధించాలని సూచించారు. డీఈఓ మాట్లాడుతూ కేజీబీవీల్లో చదివే బాలికల్లో ఎక్కువగా అనాథలు, తల్లి గానీ తండ్రి గానీ లేని వారు, పేద పిల్లలు ఉంటారన్నారు. వారిని సొంత పిల్లల్లా చూసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. శిక్షణలో నేర్చుకొన్న అంశాలను బోధనలో అమలు చేయాలన్నారు. జాయింట్ డైరెక్టర్ గీత మాట్లాడుతూ డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. కేజీబీవీల్లో చదువుతున్న ఆడపిల్లలు ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలన్నారు. వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు ఇస్మాయిల్, జీసీడీఓ మహేశ్వరి, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, అలెస్కో గోవిందెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓ మాధవరెడ్డి పాల్గొన్నారు.

రగ్బీ విజేత అనంత



చాంపియన్‌గా నిలిచి ట్రోఫీనీ అందుకుంటున్న అనంతపురం బాలికల జట్టు

కర్నూలు (టౌన్): రగ్బీ చాంపియన్లుగా కర్నూలు (బాలురు), అనంతపురం (బాలికలు) జట్లు నిలిచాయి. నగర శివారులోని ఆదర్శ విద్యా సంస్థల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 రగ్బీ క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్టు రెండో స్థానం, నెల్లూరు జట్టు మూడో స్థానం, బాలికల విభాగంలో కడప రెండో స్థానం, ప్రకాశం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు నగరపాలక సంస్థ 20వ వార్డు కార్పొరేటర్ నాగలక్ష్మీ రెడ్డి, ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ కృష్ణుడు, రాష్ట్ర రగ్బీ పోటీల పరిశీలకులు గణేష్, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు ట్రోఫీలు అందించారు.

ఇందిరమ్మ ఆశయాలు కొనసాగిద్దాం

అనంతపురం: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగిద్దామని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పిలుపునిచ్చారు.ఆదివారం ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉండగా, ఇందిరాంధీ అనేక సంస్కరణలు అమలు చేసి, అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు, నాయకులు ఎర్రిస్వామి, గంగరాజు, శంకర్, చంద్ర, నవీన్, అనిల్, శివ, సుధాకర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపిన ఇందిర

అనంతపురం టవర్‌క్లాక్: ఇందిరాగాంధీ భారతదేశాన్ని అభివృద్ధి బాటలో నడిపారని కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గాజుల వాసు తెలిపారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ 106వ జయంతి సందర్భంగా ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రామ్‌చరణ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు వడ్డ ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎండీ ఇమాం, రాష్ట్ర మైనార్టీ సెక్రటరీ అబ్బాస్, మైనార్టీ నగర అధ్యక్షుడు శర్మాస్ వలి, రవి, కృష్ణ, ఎన్‌ఎస్‌యూఐ నగర అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఆత్మకూరు: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎల్ఎం మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డితో కలిసి వారోత్సవాల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మరువవంక సమస్యకు శాశ్వత పరిష్కారం



రక్షణ గోడ పనులు జరుగుతున్న దృశ్యం



ఖాజానగర్‌లో నిర్మించిన రక్షణ గోడ

• ఖాజానగర్‌లో రూ.32 లక్షలతో రక్షణ గోడ నిర్మాణం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య గ్రూపు రాజకీయాలతో సంక్షేమం, అభివృద్ధిని విస్మరిస్తే...వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత 50 డివిజన్లలోనూ ప్రగతిబాట పట్టించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇళ్లవద్దకే పాలన తెచ్చి, మెరుగైన సేవలు అందిస్తున్నారు. దీంతో నగర ముఖచిత్రమే మారిపోయింది.

నగర నడిబొడ్డున ఖాజానగర్ మీదుగా మరువవంక వెళ్తుంది. వర్షం వస్తే మరువ పారి ఖాజానగర్ లోతట్టు ప్రాంతంలోకి భారీగా వరద నీరు వచ్చేది. దీంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి భావించారు. ఖాజానగర్‌లోని గౌరీ థియేటర్ వెనుకవైపు మరువ వంకకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.32 లక్షలతో రక్షణ గోడ (78 మీటర్లు) ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే భవిష్యత్తులో ముంపు సమస్య ఉండదు. రక్షణగోడ ఏర్పాటుపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గం ఏర్పడినప్పుటి నుంచి ఖాజానగర్‌లో రూ.1.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అభివృద్ధి పనుల్లో మొత్తం 17 పనులకుగానూ 8 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులూ జరుగుతున్నాయి.

వర్షం వచ్చినా బెంగ లేదు



వర్షం వస్తే చాలు భయపడే పరిస్థితి. వంకపారి నీరు మా వీధిలోకి వచ్చేది. నడుము లోతు వరకు నీరు నిలిచేది. దీంతో పాటు భరించలేని దుర్వాసన. రక్షణగోడ ఏర్పాటు చేస్తే సమస్య ఉండదని ప్రజాప్రతినిధులకు విన్నవించాం. వారు స్పందించి రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. గతంలో ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారమవుతోంది. – భవాని, ఖాజానగర్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: సహకార బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. ఆదివారం స్థానిక డీసీసీబీ హాలులో ఏపీకోపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ రైతులు, ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందిస్తూ పాలకవర్గం సహకారంతో బ్యాంకు పురోభివృద్ధికి ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మూడేళ్ల కాలపరిమితితో అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షులుగా సుజాత, కార్యదర్శిగా కె.సోమశేఖర్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు రవికుమార్, నారాయణరెడ్డి, రామారావు, నాయకులు పాల్గొన్నారు.

సాహిత్యం జనజాగృతం చేయాలి



పురస్కార గ్రహీతలతో ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి

అనంతపురం కల్చరల్: సాహిత్యం జనజాగృతం చేయాలని ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో అనంత కవుల వేదిక స్పందన సాహిత్య పురస్కార సభ జరిగింది. డాక్టర్ జూపల్లి సాహితీవేదికపై చంద్రశేఖరశాస్త్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆచార్య రాచపాలెంతో పాటు ఉద్యమ కవి కృపాకర్ మాదిగ, డాక్టర్ నాగేశ్వరాచారి, రాజారాం, ఉప్పరపాటి వెంకటేశులు, యాములపల్లి నర్సిరెడ్డి తదితరులు మాట్లాడారు. ఈసందర్భంగా అవార్డుకు ఎంపికైన సుంకర గోపాలయ్య, రాఘవేంద్ర, శివకుమార్, స్వయంప్రభలకు అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సాహితీవేత్తలు శాంతినారాయణ, మధురశ్రీ, తరిమెల అమరనాథరెడ్డి, వన్నప్ప, రియాజ్, షరీఫ్, మిద్దె మురళీ, ఈరన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు



మాట్లాడుతున్న విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని శారద నగర పాలక ఉన్నత పాఠశాల విద్యార్థినులకు విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు ఆదివారం నిర్వహించారు. 'పండుగలు', 'పేదరికం', 'మూఢనమ్మకాలు', 'ఆత్మవిశ్వాసం' అనే అంశాలపై నిర్వహించిన ఈ పోటీల్లో 125 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీలను విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఏజీ రాజమోహన్ ప్రారంభించారు. కార్యక్రమానికి విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్ పి. శ్రీ నివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ముత్యాలు, డీవైఎఫ్ఐ బాలకృష్ణ, యూటీఎఫ్ సురేష్ పాల్గొన్నారు.

సేవాభావంతో వైద్యశిబిరాల ఏర్పాటు

అనంతపురం కల్చరల్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సేవాభావంతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. ఆదివారం జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో మూర్ఛవ్యాధి శిబిరం ఏర్పాటు చేశారు. జేవీవీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజీ నిపుణులు శివన్నారాయణ 130 మంది మూర్ఛబాధితులకు వైద్యసేవలు అందించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ జేవీవీ సేవాభావంతో వివిధ వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని రూ. 5 వేల దాకా ఖర్చయ్యే చోట ఉచిత సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల మూడవ ఆదివారం వైద్యశిబిరం ఉంటుందని రోగులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ హరికిశోర్, జేవీవీ నాయకులు రామిరెడ్డి, వీరరాజు, ప్రసాద్‌రెడ్డి, నూర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి



బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కార్మిక, కర్షక సమన్వయ కమిటీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో మోదీ పాలనకు వ్యతిరేకంగా రూపొందించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, బాలరంగయ్య మాట్లాడారు. మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో ఈనెల 27, 28 తేదీల్లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షులు నాగభూషణం, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ కళాశాలకు ఎమర్జింగ్ - 2003 అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఎడ్యు స్కిల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రోగ్రాంలో అత్యుత్తమ పనితీరు కనబర్చిన ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలకు 'ఎమర్జింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్–2023' (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జోన్) అవార్డు వరించింది. ఎడ్యు స్కిల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల కిందట గోవాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.మధుసూదన్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. ప్రతిష్టాత్మకమైన అవార్డు దక్కడంపై కళాశాల చైర్మన్ సోమశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.